# కోలిండియా స్థాయిలో క్రీడాస్ఫూర్తిని చాటాలి

- సింగరేణి మందమర్రి ఏరియా ఎస్వోటూ జీఎం ఎస్.రాజేశ్వర్‌రెడ్డి



హాకీ పోటీలను ప్రారంభిస్తున్న మందమర్రి ఎస్వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి

మందమర్రి, అక్టోబర్ 6: క్రీడాకారులు కోలిండియా స్థాయిలో క్రీడా స్ఫూర్తిని చాటాలని సింగరేణి మందమర్రి ఏరియా ఎస్వోటూ జీఎం ఎస్.రాజేశ్వర్‌రెడ్డి పిలుపుని చ్చారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో శుక్రవారం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏరియా స్థాయి 59వ వార్షిక క్రీడల్లో భాగంగా హాకీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో గెలుపు పొందిన క్రీడాకారులు రీజియన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు ప్రతి ఏటా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, కళాకారులు కోలిండియా స్థాయిలో ప్రతి ఏటా ఎన్నో బహుమతులు సాధించి సింగరేణికి పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తున్నారని ఆయన తెలిపారు. క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దృఢత్వానికి తోడ్పడుతాయన్నారు. హాకీ పోటీలోల కేకే అండ్ ఎస్‌కే గ్రూప్ ప్రథమ బహుమతి, కాసీపేట-1,2 గ్రూప్ రెండో బహుమతి సాధించాయి. ఈ కార్యక్రమంలో క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్, క్రీడల సమన్వయ కర్త ఏ.రవికుమార్, జనరల్ కెప్టెన్ చిన్నయ్య, గ్రౌండ్ ఇన్‌చార్జ్ నస్పూరి తిరుపతి, సీనియర్ కీడాకారులు పాల్గొన్నారు.

### కోలిండియా క్రీడాకారులకు సన్మానం

శ్రీరాంపూర్, అక్టోబర్ 6: ఇల్లందులో జరిగిన సింగరేణి స్థాయి బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీల్లో గెలుపొంది కోలిండియాకు ఎంపికైన శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారులను శుక్రవారం జీఎం ఆఫీస్‌లో జీఎం సంజీవరెడ్డి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి సన్మానించారు. లక్ష్మణ్, సుధాకర్, రమేశ్, అజయ్, ఇమ్రాన్, రంజిత్‌కుమార్‌రెడ్డి బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందారు. పవర్ లిఫ్టింగ్ మహిళల విభాగంలో ప్రియాంక, నవ్యశ్రీ గెలుపొందారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియా కార్మిక క్రీడాకారులు గెలుపొంది ఏరియాకు మంచి గుర్తింపు తీసుకొచ్చారని చెప్పారు. ఇదే స్ఫూర్తితో కొలిండియాలో కూడా మంచి ప్రతిభ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్, పీవోఎం శ్రీనివాస్, డీవైజీఎం చిరంజీవులు, ఇన్‌చార్జి డీవైజీఎం రాజేశ్వరరావు, స్పోర్ట్స్ కార్యదర్శి పాలకుర్తి రాజు, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, సీనియర్ పీవో స్వజన్ పాల్, డబ్ల్యూపీఎస్‌జీఏ కో-ఆర్డినేటర్ తోట సురేశ్ పాల్గొన్నారు.

### కంపెనీ స్థాయి క్రీడల్లో సత్తా చాటాలి

రెబ్బెన, అక్టోబర్ 6: బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు కంపెనీ స్థాయి పోటీల్లో సత్తా చాటి బెల్లంపల్లి ఏరియాకు మంచి పేరు తీసుకరావాలని బెల్లంపల్లి ఏరియా డీజీఎం (ఎఫ్అండ్ఏ) రామారావు అన్నారు. బెల్లంపల్లి ఏరియాలో కొనసాగుతున్న వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 90వ వార్షిక క్రీడల్లో భాగంగా శుక్రవారం గోలేటి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో నియర్ బై ఏరియా బాల్ బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహించారు. ఈ పోటీల్లో బెల్లంపల్లి, మందమర్రి ఏరియాలకు చెందిన జట్లు తలపడ్డాయి. ముఖ్య అతిథిగా హాజరైన రామారావు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలు ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించి పతకాలు సాధించాలని, క్రీడల వలన మానసిక ఉల్లాసం, శరీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. క్రీడలతో స్నేహభావం కూడా పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా డీవైపీఎం, డబ్ల్యూపీఎస్ అండ్‌జీఏ చీఫ్ కో-ఆర్డినేటర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవో, డబ్ల్యూపీఎస్‌అండ్‌జీఏ గౌరవ సెక్రటరీ ప్రశాంత్, ఏరియా స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మురహరిరావు, బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల జనరల్ కెప్టెన్లు చంద్రకుమార్, చిన్నన్న ఉన్నారు.



సింగరేణి స్థాయి బాడీ బిల్డింగ్, వెయిట్, పవర్ లిఫ్టింగ్‌లో గెలుపొందిన క్రీడాకారులను సన్మానిస్తున్న జీఎం, అధికారులు



గోలేటి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులతో ఏరియా డీజీఎం (ఎఫ్అండ్ఏ) రామారావు




ఎస్ఆర్పీ 3లో కార్మికులకు జనరల్ మజ్దూర్ లేఖలు అందిస్తున్న డీవైజీఎం సంతోశ్‌కుమార్

### బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్ లేఖలు

శ్రీరాంపూర్, అక్టోబర్ 6: శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ-3 గనిలో బదిలీ వర్కర్లకు శుక్రవారం గని డీవైజీఎం సంతోశ్‌కుమార్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి జనరల్‌మజ్దూర్ లేఖలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికులకు బదిలీ వర్కర్ల నుంచి జనరల్‌మజ్దూర్‌గా పదోన్నతి కల్పిస్తున్నామన్నారు. గతంలో 6, 7 సంవత్సరాలకు లభించే జనరల్‌మజ్దూర్ పదోన్నతి తెలంగాణ వచ్చిన తర్వాత ప్రతీ సంవత్సరం కల్పిస్తున్నామని తెలిపారు. పదోన్నతితో కార్మికులకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. సంస్థ పట్ల మరింత అంకిత భావంతో పనిచేయాలని కార్మికులకు సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఇన్‌చార్జి పిట్ కార్యదర్శి సాదుల భాస్కర్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మురళీ చౌదరి, సీఐటీయూ కార్యదర్శి భాగ్యరాజ్, నాయకులు సుధాకర్, రమణారెడ్డి పాల్గొన్నారు.

### సోలార్ పవర్ ప్లాంట్ పనుల పరిశీలన



సోలార్ పవర్ ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవ రెడ్డి

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 6: చెన్నూర్ మండలంలోని శివలింగాపూర్ గ్రామ సమీపంలో కొనసాగుతున్న సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవ రెడ్డి పరిశీలించారు. చెన్నూర్-1 ఇంక్లైన్ గని ఆవరణలో త్వరలో ప్రారంభమవుతున్న 27.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ స్థల పరిశీలన, చెన్నూర్- 2 ఇంక్లైన్ గని ఆవరణలో 11 మెగావాట్ల సోలార్ విద్యుత్ పనులను ఆయన పరిశీలించారు. వీలైనంత తొందరగా పనులను పూర్తి చేసి సోలార్ విద్యుత్‌ను ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీజీఎం సివిల్ ఆనంద్, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గెండె రావు, ఏరియా వర్క్ షాప్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

### కార్మికులకు అండగా టీబీజీకేఎస్



కాసిపేట గనిపై మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సంపత్

కాసిపేట, అక్టోబర్ 6: కార్మికులకు అండగా ఉంటూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ స్పష్టం చేశారు. శుక్రవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై టీబీజీకేఎస్ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సంపత్ మాట్లాడారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా కార్మికులకు లాభాల వాట పెంచి, ఇప్పిస్తామన్నారు. గతంలో జాతీయ సంఘాలు వారి కాలంలో పోగొట్టిన కార్మికుల హక్కులతో పాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కార్మికుల పక్షపాతి సీఎం కేసీఆర్ అనేక కొత్త హక్కులను అమలు చేశారన్నారు. శ్రీరాంపూర్‌లో జరిగిన సింగరేణి ఆత్మీయ సమ్మేళనంలో బొగ్గు ఉత్పత్తి చేసే కార్మికులకు అప్పటికప్పుడు బేసిక్‌లో ఒక శాతం విద్యుత్ బిల్లు మాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. బోనస్ తెలంగాణ ఏర్పాటుకు ముందు 20 శాతం ఉన్న లాభాల వాటాను అంచలంచెలుగా పెంచి 32 శాతానికి పెంచుతూ ప్రతి కార్మికుడికి సుమారు రూ.లక్షా యాభై వేలు ఈ నెల 16న కార్మికుల ఖాతాల్లో వచ్చే విధంగా సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. సింగరేణి కార్మికులకు టీబీజీకేఎస్ అండగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికెల సంపత్, రీజినల్ సెక్రెటరీ వో రాజశేఖర్, ఏరియా వొడ్నాల రాజన్న, బైరి శంకర్, జాడి శివ, మైన్ కమిటీ సభ్యులు, సేఫ్టీ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

### 'కస్తూర్బా'ను తనిఖీ చేసిన ఎంపీడీవో

కాటారం, అక్టోబర్ 6 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ఎంపీడీవో ఎం శంకర్ నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్ రూం, వంటశాల, తరగతి గదులు పరిశీలించారు. పాఠశాల పరిసరాలను కలియదిరిగారు. నళిని, లక్ష్మి, శ్రీనివాస్ తదితరులున్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

మల్హర్, అక్టోబర్ 6 : అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని తాడిచర్లకు చెందిన మల్లయ్య, సప్పుకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. మల్లయ్యకు రూ. 28 వేలు, సప్పుకు రూ. 16 వేల విలువైన చెక్కులను పుట్ట మధుకర్ పంపిణీ చేశారు.

### అంబట్‌పల్లిలో వైద్య శిబిరం

మహదేవపూర్, అక్టోబర్ 6 : మండలంలోని అంబట్‌పల్లిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ మాషూక్ అలీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### 'సింగరేణి' ఎన్నికల్లో నామినేషన్ దాఖలు

కొత్తగూడెం సింగరేణి, అక్టోబరు 6: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషన్ ఆఫీసులో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్ తదితర 10 కార్మిక సంఘాలు నామినేషన్ దాఖలు చేశాయి. ఈనెల 28న ఎన్నికలు జరుగాల్సి ఉండగా, సింగరేణి యాజమాన్యం కోర్టును ఆశ్రయించింది. ఈనెల 11న విచారణ జరుగనుంది.

# ఎమ్మెల్యే దృష్టికి వర్క్‌షాప్ సమస్యలు

రెబ్బెన, అక్టోబర్ 6: బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్ ఉద్యోగుల సమస్యలను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దృష్టికి తీసుకెళ్లినట్లు టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్లారజు శ్రీనివాసరావు తెలిపారు. ఎలక్ట్రీషియన్లు, జనరల్ మజ్దూర్లను పోస్టింగ్ చేయించి, సింగరేణి ప్రైవేటీకరణను ప్రోత్సహించకుండా యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలన్నారు. అదే విధంగా గోలేటిటౌన్‌షిప్, మదారంటౌన్‌షిప్ మెయింటెనెన్స్ సింగరేణి ఉద్యోగుల ద్వారా మాత్రమే చేయించాలన్నారు. ఫ్లేడేల సంఖ్య పెంచాలని, అధికారులను నియమించాలని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య యాజమన్యంతో మాట్లాడి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ చర్చల ప్రతినిధి దారావత్ మంగీలాల్, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, వర్క్‌షాప్ పిట్ కార్యదర్శి కందుల తిరుపతి, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి చంద్రయ్య, నాయకులు రాజేశం, దాసు, వైకుంఠం, పోశం, శ్రీనివాస్, రాములు, రాజయ్య ఉన్నారు.



బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తో టీబీజీకేఎస్ నాయకులు, ఏరియా వర్క్‌షాప్ ఉద్యోగులు